క్లుప్తంగా

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోమయ్యగౌడ్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన యల్క సోమయ్యగౌడ్ తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం మహా సభలో తనను ఎన్నుకున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. పట్టణానికి చెందిన ములకలపల్లి పద్మ.. రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

కోతుల సమస్యను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న 14వ వార్డు ప్రజలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14వ వార్డులో కోతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డుకు చెందిన పలువురు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డులో కోతులు, కుక్కలు, పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొల్లపూడి యోహాన్, ఎన్.నవీన్, కె.రాము, రమేష్, సాయిరాం ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు పంపిణీ

కోదాడరూరల్ : రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో కోదాడ పెరిక సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, పాయిలి కోటయ్య, బత్తిని కృష్ణమూర్తి, పత్తిపాక జనార్దన్, వనం నాగేశ్వరరావు, బుడిగం కిరణ్‌కుమార్, ముత్తినేని కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమ పూజ



గోపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో శుక్రవారం కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో గో పూజ చేశారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

మునగాల : జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 14న నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, బీసీ సేన జాతీయ ప్రధాన కార్యదర్శి నరాల రుక్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయమని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే మూల్యం చెల్లించక తప్పదు

కోదాడరూరల్ : బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న పార్టీలు, నాయకులు వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని బహుజన సామాజిక న్యాయ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ గుండు విజయరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీల నోటికాడికి వచ్చిన ముద్దను ఎగరగొడుతున్న వారందరిని బీసీ జాతి గమనిస్తుందని తెలిపారు. బీసీలు రాజకీయంగా ఎదుగుతుంటే కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. బీసీ కులస్తులందరూ ఐక్యంగా రిజర్వేషన్ అమలుకు ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మునగాల : బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయాలని చూస్తుందని బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణ యాదవ్ అన్నారు. శుక్రవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో 15శాతం ఉన్న ఓసీలకు ఎన్నికల్లో 25 శాతం రిజర్వేషన్ ఇచ్చినప్పటికీ బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణలో 56శాతం ఉన్న బీసీలకు ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇస్తే తప్పేంటని అన్నారు. ఉద్యోగాలలో తమ వాటా తమకు వచ్చేలా ఉద్యమం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్టీ పరంగానైన బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14ల బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబోయే బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

స్థలం ఉన్నా.. క్రీడలకు దూరం

- కేజీబీవీకి రెండెకరాల స్థలం
- పాఠశాల చుట్టూ ప్రహరీ లేక నిరుపయోగం
- తరగతి గదులకే పరిమితం అవుతున్న బాలికలు



పాలకవీడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

పాలకవీడు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. పాఠశాలకు రెండెకరాల స్థలం ఉన్నా చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో పాఠశాల నుంచి బయటకు వెళ్లలేకపోతున్నారు. క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, మాక్ అసెంబ్లీ, ఇతర బహిరంగా కార్యక్రమాలు సైతం జరుపుకోలేపోతున్నారు. తరగతి గదులు ఆతర్వాత వసతి గృహంలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రహరీ లేక.. బయటకు వెళ్లలేక

మండల కేంద్రంలో కేజీబీవీ నిర్మాణానికి మూడు సంవత్సరాల క్రితం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. రూ.3.50 కోట్ల నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాల భవనాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. 2024 జూన్ నుంచి అందులో తరగతులను ప్రారంభించారు. కానీ పాఠశాలకు కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. దీంతో బాలికలు తరగతి, హాస్టల్ గదులు విడిచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తే విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఉంటుంది. పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు, జాతీయోత్సవాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుంది. క్రీడా స్థలం లేకపోవడంతో క్రీడల్లో ప్రతిభ కనబరిచే అవకాశాలను కూడా విద్యార్థినులు కోల్పోతున్నారు. 300 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్న ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రహరీ నిర్మించాలి



“ కేజీబీవీకి కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు ఆటలకు దూరమవుతున్నారు. పాఠశాల భవనం భద్రతకు, బాలికల సౌకర్యానికి ప్రహరీ నిర్మాణం అవసరం. ప్రహరీ నిర్మించి తరగతి గదుల్లోనే పరిమితమవుతున్న బాలికలకు విముక్తి కలిగించాలి. ఈవిషయమైన అధికారులు స్పందించాలి

– పెరుమాళ్ల సతీష్, యువజన నాయకుడు, యల్లాపురం

వినియోగంలోకి తేవాలి

“ కస్తూరిబా పాఠశాల చుట్టూ సుమారు రెండు ఎకరాల స్థలం ఉంది కానీ ప్రహరీ లేక వినియోగంలో లేదు. దీంతో ఆటలు, జాతీయోత్సవాలు, అవగాహన కార్యక్రమాలు, డ్రిల్‌కు విద్యార్థులకు ఇబ్బంది ఉన్నమాట వాస్తవమే. ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పూర్తిగా వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– సుజాత, ఎస్‌ఓ, కేజీబీవీ, పాలకవీడు

ముగిసిన సురేష్‌బాబు అంత్యక్రియలు



దొడ్డా సురేష్‌బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించారు. దొడ్డా సురేష్‌బాబు రెండు రోజుల క్రితం కోదాడలో సాయంత్రం వేళ స్నేహితులతో మాట్లాడుతుండగా గుండెపోటు రావడంతో వైద్యశాలకు తీసుకెళ్లే లోపే మృతి చెందారు. ఆయన ఇద్దరు పిల్లలు అమెరికా నుంచి వచ్చాక శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కోదాడ నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు సురేష్‌బాబు మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సురేష్‌బాబు పాడె మోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీ పరంగా సురేష్‌బాబు మరణం తీరని లోటని అన్నారు. సురేష్‌బాబు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. అంత్యక్రియల్లో మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సైదులు మృతి బాధాకరం

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దొంతగాని సైదులు గురువారం అనారోగ్యానికి గురై మృతి చెందారు. శుక్రవారం సైదులు మృతదేహాన్ని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైదులు మృతి బాధాకరమని అన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తొగరు రమేష్, నాయకులు కోల ఉపేందర్‌రావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- గాలికి లేచిపోయిన ఇళ్లపై రేకులు



గాలికి రేకులు లేచిపోయిన ఇల్లు

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో గురువారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులకు ఇళ్లపై రేకులు లేచిపోయాయి. కొమ్మరాజు లక్ష్మి ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా లేచిపోయి ఖాళీ స్థలంలో పడడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో వి లువైన సామగ్రి దెబ్బతిన్నాయి. రెవెన్యూ అధి కారులు ఇంటిని పరిశీలించి నష్టాన్ని అంచనా వే శారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

అప్పన్నపేటలో గురువారం రాత్రి గాలివాన బీభత్సానికి అప్పన్నపేట నుంచి గరిడేపల్లికి వెళ్లే ప్రధాన రహదారి వెంట మూడు విద్యుత్ స్తంభాలు కూలిపోయి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మరికొన్ని స్తంభాలు ఒరిగాయి. దీంతో సుమారు 24 గంటల పాటు పాత, కొత్త అప్పన్నపేట గ్రామానికి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఒరిగిపోయిన స్తంభాల స్థానంలో శుక్రవారంఏఈ సాయికృష్ణ ఆధ్వర్యంలో కొత్త స్తంభాలను వేసి ఒరిగిన స్తంభాలను సరిచేసి విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. గరిడేపల్లి సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే ప్రధాన లైన్ స్తంభం ఒరిగిపోయింది. ఆ స్తంభం పొలాల మధ్య ఉండటంతో దాని స్థానంలో కొత్త స్తంభం వేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గంలో గ్రామానికి తాత్కాలికంగా విద్యుత్ సరఫరా అందించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పొలం మధ్యలో ఉన్న స్తంభాన్ని శనివారం తొలగించి కొత్త స్తంభాన్ని నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించొద్దు

మునగాల : కార్లు, ఇతర వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిలిం వేయించడం మోటారు ట్రాన్స్ పోర్టు చట్టరీత్య విరుద్ధమని స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ రహదారిపై ప్రయాణించే పలు వాహనాలను మునగాల వద్ద తనిఖీ చేసి బ్లాక్ ఫిలిమ్‌లను తీసివేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బ్లాక్ ఫిలిమ్ వెనుక నేర సంఘటనలు జరిగిన సందర్భాలు ఉన్నాయని, ఇప్పటికే బ్లాక్ ఫిలిమ్‌లు ఉపయోగిస్తున్న వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ

మోతె : వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించొద్దని మోతె ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు.



మునగాల : వాహనం అద్దం నుంచి బ్లాక్ ఫిలింను తొలగిస్తున్న ఎస్ఐ

సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని మామిళ్లగూడెం టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉన్న పలు కార్లను గుర్తించి తీయించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లాక్ ఫిలిం వెనక నేర ఘటనలు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఆయన తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి



నేరేడుచర్ల : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్



మునగాల : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

నేరేడుచర్ల : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఇంటర్మీడియేట్ బోర్డు జిల్లా అధికారి భానునాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండేందుకు సమాచార హక్కు చట్టం దోహదపడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటర్మీడియేట్ కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ సిస్టం అమలు చేస్తున్నామని, ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన..

మునగాల : సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాడువాయి శివారులో ఉన్న సెయింట్స్ పాఠశాలలో సమాచార హక్కు చట్టంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఆర్టీఐతో ప్రభుత్వ సంస్థల నుంచి ఎటువంటి సమాచారం పొందవచ్చనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు. స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

నేరేడుచర్ల : ఆటో డ్రైవర్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఆటో కార్మికులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఉందని, పోక్సో కేసు గురించి కూడా తెలుసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్ల వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌తో పాట అన్ని ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లు ఆటోలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో కార్మికులు తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న 'సాక్షి' ఏజెంట్

- తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన శ్రీను



పోలీసుల సమక్షంలో సెల్‌ఫోన్ అందజేస్తున్న సాక్షి ఏజెంట్ శ్రీను

చిలుకూరు : దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు చిలుకూరు గ్రామానికి చెందిన సాక్షి పేపర్ ఏజెంట్ శ్రీను. శుక్రవారం తెల్లవారుజామున సాక్షి పేపర్ వేస్తున్న క్రమంలో చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో గల వాసు టిఫిన్ సెంటర్ వద్ద శ్రీనుకు సెల్‌ఫోన్ దొరికింది. దీంతో సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్ చిలుకూరుకు చెందిన శివదిగా పోలీసులు గుర్తించారు. అతనికి పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్ అందజేశారు. నిజాయితీ చాటుకున్న శ్రీనును పోలీసులు, గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

42శాతం రిజర్వేషన్‌తో బీసీలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే వారికి న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుపై రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వై.రాములు, పట్టణ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం



108 సిబ్బందికి రెయిన్ కోట్‌లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు అత్యవసర సేవలు అందిస్తున్న 108 సిబ్బంది సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్లు బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త రావులపల్లి ప్రసాద్ జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన సహకారంతో నేరేడుచర్లలో 108 సిబ్బందికి రెయిన్ కోట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీత కనకయ్య, ప్రధాన కార్యదర్శి యూసుఫ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, యడవల్లి సత్యనారాయణరెడ్డి, రామస్వామి, కందిబండ శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, షావయ్య తదితరులు ఉన్నారు.

మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ మానసిక ప్రశాంతత కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హుజూర్‌నగర్‌లోని కోర్టు హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బాలికా దినోత్సవం..

ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమయం ఉన్నప్పుడుల్లా ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని తద్వారా మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం మాజీ సర్పంచ్ మండవ అంతయ్య, రత్నవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామిని రవీందర్‌రెడ్డి (48) ఇటీవల మృతి చెందారు. శుక్రవారం మృతుల కుటుంబాలను కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట కోదాడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంతయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

సామాజిక సేవలో యువత ముందుండాలి



ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పసుపుల మద్దిలేటి

నడిగూడెం : సామాజిక సేవలో యువత ముందుండాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జతీయ సేవా సమితి కో ఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి కోరారు. శుక్రవారం నడిగూడెం మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండాలో నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించబోయే ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని, పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.విజయ నాయక్, ఎస్ఐ గండమళ్ల అజయ్ కుమార్, మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శోభన్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.షేక్.జానిపాషా, కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు మహేష్, వీరన్న, మదారు, సుజాత, మణి, నాగరాణి, శైలజ, కాటమరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ వర్మ ఆరోపించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా విద్యా రంగంలో పురోగతి లేదని అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సరైంది కాదని అన్నారు. పేద విద్యార్థులకు చదువును దూరం చేసే కుట్ర జరుగుతుందని ఆయన ఆరోపించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ హుజూర్‌నగర్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చెవగాని ప్రదీప్ గౌడ్, నందిపాటి లోహిత్, ఆఫీస్ బేరర్స్‌గా పవన్, సాకేత్, నవనీత్, జగన్ సింగ్, షరీఫ్, రాకేష్‌తో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకట్ రెడ్డి, పి.శ్రవణ్, వీరబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వర్మ

విద్యారంగంలో రాజశేఖర్ కృషి ఎనలేనిది

హుజూర్‌నగర్ : డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ విద్యారంగంలో చేసిన కృషి ఎనలేనిదని కాంప్లెక్స్ హెచ్ఎం పెనుకొండ శ్రీనివాస్ అన్నారు. ఏపీలోని యోగి వేమన విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన అనంతరం తొలిసారి శుక్రవారం స్వగ్రామమైన మండలంలోని లింగగిరికి వచ్చిన ఆయనకు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పెనుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ ఈ ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.ధనలక్ష్మి, ఉపాధ్యాయులు నాజీమా, జ్యోతి, చందు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ : 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు గోవిందరావు, రాయల వెంకటేశ్వర్లు, రావినూతల ఇందిర, గురుస్వామి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సీతమ్మ, బ్రహ్మచారి, చిన్న సైదులు, ఆంజనేయులు, పెద్ద సైదులు, పెద్ద వెంకటేశ్వరావు, సైదా తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో..

బీసీలంతా ఏకతాటిపై నిలిచి తమ సత్తా చాటాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు గురుస్వామి అన్నారు. శుక్రవారం మండంలోని బూరుగడ్డలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గోపి, వెంకటేష్, హరీష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మఠంపల్లి : రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రైల్వే లైన్ పనుల పరిశీలనకు వచ్చిన రైల్వే సికింద్రాబాద్ డివిజన్ మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణకు మదిర బ్రాంచ్ దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ (డీఎంఆర్‌కేస్) ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జగ్గయ్యపేట వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మఠంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మఠంపల్లిలోని రైల్వే క్వార్టర్లలో నీటి సమస్య, మెస్ డోర్స్, ట్రాక్మెన్, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు వీరభద్రం, కోశాధికారి రాంకోటి, యూనియన్ నాయకులు నవీన్‌కుమార్, అనిల్‌కుమార్ ఉన్నారు.

'బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్తారు'

గరిడేపల్లి : బీజేపీ ప్రభుత్వం రాజకీయ ఉద్దేశంతోనే బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలు కాకుండా అడ్డుకుందని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ ఆరోపించారు. శుక్రవారం గరిడేపల్లి మండల పరిధిలోని తాళ్లమల్కాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో అసెంబ్లీలో చర్చ పెట్టిందని, ఆ సమయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని ఆయన తెలిపారు. కానీ బీజేపీ ప్రభుత్వమే బిల్లును అడ్డుకుంటుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వట్టికూటి అంజయ్య, కొణతం కృష్ణయ్య, వీరయ్య, వరప్రసాద్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.